క్లుప్తంగా

గడికోటలో గంగమ్మ జాతర



పూజల్లో పాల్గొన్న హైకోర్టు మాజీ జడ్జి నాగార్జునరెడ్డి

వీరబల్లి : మండలంలో గడికోట పంచాయతీలో ఎడబల్లె సమీపంలో వెలసిన గంగమ్మ జాతరను శుక్రవారం ప్రారంభమైంది. శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అలాగే పలువురు భక్తులు చాందినీ బండ్లు కట్టి తమ మొక్కుబడులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమాలు ఉమ్మడి రాష్ట్ర హైకోర్టు మాజీ జడ్జి సీవీ నాగార్జున రెడ్డి, స్థానిక నాయకులు రాజీవ్ రెడ్డి, నరేందర్ రెడ్డిల ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్లు కార్యనిర్వాహకులు పేర్కొన్నారు. మండలంలోని భక్తులు విరివిగా పాల్గొని అమ్మవారి దీవెనలు అందుకోవాలని నిర్వాహకులు తెలియజేశారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి



ఆకుల తిరుమలబాబు తహసీల్దారు

సిద్దవటం : మండలంలోని భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని సిద్దవటం తహసీల్దారు ఆకుల తిరుమల బాబు తెలిపారు. సిద్దవటం తహసీల్దారుగా శుక్రవారం ఆయన బాధ్యతలను చేపట్టారు. అనంతరం మాట్లాడుతూ కడప ఆర్డీఓ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దారుగా విధులను నిర్వర్తిస్తూ పదోన్నతిపై సిద్దవటం మండల తహసీల్దారుగా బాధ్యతలను చేపట్టానన్నారు. ప్రభుత్వ డీకేటీ భూములు అన్యాక్రాంతానికి పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజల నుంచి వచ్చే అర్జీల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు. భూ కబ్జాల సమస్యలు ఏవైనా ఉంటే మండల ప్రజలు తన దృష్టికి తీసుకురావాలని తెలియజేశారు.

కాలిబాట యాత్రికుల వసతికి స్థలం కేటాయించండి



వినతిపత్రం అందిస్తున్న హిందూ సంఘాలు

రైల్వేకోడూరు అర్బన్ : అన్నమయ్య కాలిబాట ద్వారా ప్రతి ఏడాది తిరుమలకు వెళ్లే వారి కోసం కుక్కలదొడ్డి గ్రామంలో వసతిగృహం ఏర్పాటుకు 50 సెంట్ల స్థలం కేటాయించాలని శుక్రవారం హిందూ, ధార్మిక సంఘాలు తహసీల్దార్ మెహబూబ్ చాంద్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నమయ్య కాలిబాట ద్వారా ప్రయాణించే యాత్రికులకు సరిహద్దు కుక్కలదొడ్డి ప్రాంతంలో స్థలం ప్రభుత్వం అందిస్తే హిందూ సంఘాల ద్వారా వసతి భవనం నిర్మించుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలసుబ్రమణ్యం, సాయిఆచారి, సుబ్బారావు, నాగరాజు, వీర, రామసుబ్బయ్య, సతీష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాపై దృష్టి పెట్టాలి



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి పవన్ రెడ్డి

పెనగలూరు : యోగాపై అధికారులు దృష్టి పెట్టాలని మండల ప్రత్యేకాధికారి పవన్ కుమార్ రెడ్డి తెలిపారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ నెల రోజుల పాటు యోగాపై ప్రత్యేక దృష్టి పెట్టి వివిధ కార్యక్రమాలు చేపట్టాలని ఆయన తెలియజేశారు. అన్ని శాఖలు యోగాపై ప్రత్యేకంగా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీఓ విజయారావు మాట్లాడుతూ యోగాంధ్రను విజయవంతం చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తహసీల్దార్ అమరేశ్వరీ, వివిధ శాలకు చెందిన అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

25న విద్యార్థుల సమ్మేళనం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1993 – 94 బ్యాచ్ పదోతరగతి విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధులు తెలిపారు. ఈ ఆత్మీయ సమ్మేళనంలో ఉపాధ్యాయులకు సహకారం, పాఠశాల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలను తెలియజేస్తామన్నారు. 1993 – 94లో పదో తరగతి చదివిన ప్రతి విద్యార్థి హాజరు కావాలని వారు కోరారు.

31న శిక్షణా తరగతులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో కారు డ్రైవింగ్, సెల్‌ఫోన్ రిపేరింగ్, సర్వీసింగ్, ఫోటో, వీడియోగ్రఫీలో ఈనెల 31వ తేది నుంచి ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ డైరెక్టర్ ఆరీఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తారన్నారు. ఇతర వివరాలకు 94409 05478, 99856 06866 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

పోషకాలు అధికం.. పైరుకు జీవం

- పచ్చిరొట్ట సాగుతో ఎంతో మేలు
- భూసారం గణనీయంగా వృద్ధి
- రసాయన ఎరువుల నియంత్రణ
- పంట దిగుబడికి లాభదాయకం



పచ్చిరొట్టె పంట సాగు చేసిన రైతు (ఫైల్)

రాయచోటి జగదాంబసెంటర్ : రబీ వరి కోతలు పూర్తవ్వగానే మూడో పంటగా పచ్చిరొట్టను సాగు చేపడితే భూమిలో సారం పెరుగుతుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు. ఎక్కడ చూసినా రసాయన ఎరువుల వాడకం పెరిగిపోయింది. రసాయన ఎరువుల అధిక వినియోగం, పంటల మార్పిడి విధానాన్ని పాటించకపోవడం వలన భూసారం కోల్పోతున్న విషయాన్ని రైతులు నిర్లక్ష్యం చేస్తున్నారు. గతంలో రైతులు భూసారం పెరగడానికి పచ్చిరొట్ట పైర్లను రబీ పంటల అనంతరం వేసేవారు. ఇటీవల కాలంలో పచ్చిరొట్ట పైర్ల పెంపకం గణనీయంగా తగ్గిపోయింది. దీంతో భూసారం తగ్గి పంటలు తెగుళ్లబారిన పడుతున్నాయి. రైతులు ఈ తెగుళ్లను అరికట్టడానికి విచ్చలవిడిగా రసాయన మందులను పిచికారీ చేసి అనర్థాలను కొని తెచ్చుకుంటున్నారు. రబీ పంట అనంతరం పచ్చిరొట్ట పైర్లను పెంచడం వలన భూసారం బాగా పెరుగుతుంది. అలాగే పలుచోట్ల జీలుగ, పిల్లిపెసర, జనుము సాగు చేపట్టారు.

స్థూల పోషకాలు అధికం

జనుము, జీలుగ, పిల్లిపెసర తదితర రకాలను రబీ పంట అనంతరం సాగు చేయాలని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. వారి వివరాల మేరకు వీటిని పూత దశ వరకు పెంచి భూమిలో కలియదున్నాలి. పచ్చిరొట్ట పైర్లలో స్థూల పోషకాలు అధికంగా ఉంటాయి. నత్రజని 1.8 శాతం నుంచి 3.5 శాతం వరకు ఉంటుంది. భాస్వరం 0.1 శాతం నుంచి 0.3 శాతం, పొటాషియం 0.5 నుంచి 2 శాతం వరకు ఉంటాయి. స్థూల పోషకాలతో పాటు, సూక్ష్మ పోషకాలు కూడా భూమికి లభిస్తాయి. పంటల ఎదుగుదలకు ఈ మూడు పోషకాలు ఎంతో అవసరం. అలాగే నేలలు సంపూర్ణమై ఉత్పాదకత పెరుగుతుంది. భూమి లోపల నిక్షిప్తమైన పోషకాలను ఈ పైర్లు వెలికితీస్తాయి. సేంద్రియ కర్బనం పెరుగుతుంది. ఈ పైర్ల సాగు వలన 30 శాతం రసాయన ఎరువుల వినియోగం తగ్గుతుంది. గుళికలను అధికంగా వాడటం వలన భూమి లోపల సూక్ష్మజీవులు నశించిపోతున్నాయి. పంటల పెరుగుదలకు ఉపయోగకరమైన సూక్ష్మజీవులు నశించడం వలన దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. పచ్చిరొట్ట పైర్లను భూమిలో కలియదున్నడం వలన తిరిగి సూక్ష్మజీవులు అభివృద్ధి చెందే అవకాశం ఉంది.

సద్వినియోగం చేసుకోవాలి



రాబోయే తరాలకు భూమిని సారవంతంగా ఉంచాలంటే పచ్చిరొట్ట ఎరువులు వేయాలి. ప్రధాన ఎరువులకు చేసే ఖర్చును తగ్గించుకుని, నికర లాభం పొందడానికి వీలవుతుంది. రైతులు పచ్చిరొట్ట సాగు చేయడానికి ముందుకు రావాలి.

– నాగమణి, వ్యవసాయాధికారిణి, రామాపురం

ప్రతి రైతు విత్తనశుద్ధి చేయాలి

సిద్దవటం : వరి నారు పోసే ప్రతి రైతు కచ్చితంగా విత్తన శుద్ధి చేసుకోవాలని, తద్వారా విత్తనం భూమి ద్వారా సంక్రమించే తెగుళ్లను నివారించవచ్చునని బద్వేల్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగరాజ తెలిపారు. సిద్దవటం మండలంలోని పెద్దపల్లి, బొగ్గిడివారిపల్లె, మాధవరం–2 రైతు సేవా కేంద్రాలను శుక్రవారం బద్వేల్ ఏడీఏ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నదాత సుఖీభవ అర్హులైన రైతుల జాబితాను పరిశీలన ప్రక్రియను సమీక్షించామన్నారు. అలాగే మట్టి నమూనాలను సేకరించడం పూర్తి చేసి 24తేదీ రైతుల జాబితాతో సహా ఊటుకూరులోని భూసార పరీక్షా కేంద్రంలో సబ్మిట్ చేయాలని సిబ్బందికి ఆదేశించారు. జూలైలో పసుపు సాగు చేస్తారని, అంతకు ముందే నవధాన్యాల విత్తనాలతో పీఎండీఎస్ సాగు చేపట్టాలని తద్వారా భూసార వృద్ధి, సేంద్రియ కర్బనం శాతం పెరుగుతుందన్నారు. రైతు పొలంలో కనీసం 1 శాతం సేంద్రియ కర్బనం ఉండేలా చూసుకోవాలన్నారు. వ్యవసాయ శాఖ 50 శాతం సబ్సిడీపై పంపిణీ చేస్తున్న జనుము విత్తనాలకు ఇతర పప్పు దినుసులు, నూనె గింజలు, ధాన్యాలు, సుగంధ ద్రవ్యాలు వంటి ఇతర రకాల విత్తనాలు కలిపి సాగు చేయడం రైతులు అలవాటు చేసుకోవాలని తెలిపారు. ఖరీఫ్ 2025 ప్రణాళికపై చర్చించి తగు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

1 నుంచి రేషన్ షాపు వద్దే బియ్యం



మాట్లాడుతున్న తహసీల్దార్ భాగ్యలత

గాలివీడు : జూన్ 1వ తేదీ నుంచి రేషన్ షాపుల వద్దనే బియ్యం పంపిణీ జరుగుతుందని తహసీల్దార్ భాగ్యలత పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో డీలర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో మాదిరిగా ఇంటి వద్ద రేషన్ పంపిణీ ఉండదని, రేషన్ షాపుల వద్దకు వెళ్లి లబ్ధిదారులు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీలోపు ఉదయం 8 గంటల నుంచి 12 వరకు, మధ్యాహ్నం సాయంకాలం 4 నుంచి 8 గంటల వరకు విధిగా పంపిణీ చేయాలని డీలర్లకు సూచించారు. అందులో 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులు, దివ్యాంగులు, మంచాన పడ్డ వారికి ఇంటి వద్దనే పంపిణీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బాలాజీ, డీలర్లు పాల్గొన్నారు.

పక్కా గృహాలను త్వరగా పూర్తి చేయండి



పూర్తి కాని పక్కాగృహాలను పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈ గోపాలక్రిష్ణ

సిద్దవటం : మండలంలోని జ్యోతి, వంతాటిపల్లె, ఎస్.రాజంపేట, మూలపల్లె గ్రామాల్లో గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన పక్కా గృహాలను శుక్రవారం హౌసింగ్ డీఈ గోపాలక్రిష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన లబ్ధిదారులకు పలు సూచనలు సలహాలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మంజూరైన పక్కా గృహాల నిర్మాణ పనులను జూన్ 10వ తేదీ లోపు పూర్తి చేయాలన్నారు. ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు గృహ నిర్మాణ పనులు పూర్తి చేసుకునేందుకు అదనంగా ఒక్కొక్కరికి రూ. 50 వేలు మంజూరు అవుతున్నాయన్నారు. ముఖ్యమంత్రి జూన్ నెలలో పక్కా గృహాలను ప్రారంభోత్సవం చేస్తున్న సందర్భంలో ఇంటి నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని చెప్పారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చెన్నయ్య, వర్క్ ఇన్‌స్పెక్టర్ సునీత, లబ్ధిదారులు పాల్గొన్నారు.

తూకాల్లో అవకతవకలు ఉండకూడదు

పెనగలూరు : జూన్ ఒకటో తేదీ నుంచి రేషన్ షాపులు ద్వారానే డీలర్లు కార్డులకు బియ్యం, ఇతర వస్తువులను పంపిణీ చేయాలని తహసీల్దార్ అమరేశ్వరీ తెలిపారు. తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని డీలర్లకు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డీలర్లను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ ఒకటో తేదీ నుంచి కార్డులకు రేషన్ షాపుల ద్వారానే బియ్యాన్ని పంపిణీ చేయాలన్నారు. ప్రభుత్వం ఇచ్చిన రేట్లకే వస్తువులు పంపిణీ చేయాలన్నారు. అలాగే తూకంలో అవకతవకలు లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత డీలర్లపై ఉందని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ రాజశేఖర్ మండలంలోని రేషన్ షాప్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

దొంగ పాసుపుస్తకాల జారీ చేసిన వ్యక్తికి రిమాండ్

సుండుపల్లె : మండల తహసీల్దార్ కార్యాలయంలో దొంగ పాసు పుస్తకాలు జారీ కేసులో గతంలో అటెండర్‌గా పనిచేసిన పూజారి నాగన్నపై సుండుపల్లె పోలీసులు కేసు నమోదు చేసి శుక్రవారం కోర్టుకు హాజరుపరిచారు. ఈ కేసుకు సంబంధించి రాయచోటి కోర్టు వారు పూజారి నాగన్నకు 14 రోజుల రిమాండ్ విధించినట్లు పోలీసులు చెప్పారు. మండల వ్యాప్తంగా కొంతమంది రైతుల వద్ద నుంచి భూమికి పాసు పుస్తకాలు చేయిస్తానని చెప్పి డబ్బులు వసూలు చేసి దొంగ పాసుపుస్తకాలు జారీ చేయించిన కేసులో అరెస్టు చేసినట్లు ఎస్ఐ ముత్యాల శ్రీనివాసులు పేర్కొన్నారు.

వెన్నుపోటు పొడిచిన వ్యక్తికే ఇన్‌చార్జ్ పదవి

- ఇప్పటికైనా ఆరోపణలు మాని అభివృద్ధికి సహకరించు
- చమర్తి నీచ రాజకీయాలపై వైఎస్సార్‌సీపీ నాయకులు ధ్వజం



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

రాజంపేట రూరల్ : వైఎస్సార్‌సీపీపై నిరాధారమైన ఆరోపణలతోనే చమర్తికి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ పదవి దక్కిందని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పాపిసేని విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆకేపాటి భవన్‌లో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఏ అర్హతతో టీడీపీ అధిష్టానం చమర్తి జగన్‌మోహన్‌రాజుకు నియోజకవర్గ బాధ్యతలు అప్పగించారో కార్యకర్తలకే తెలియడంలేదంటూ ఎద్దేవా చేశారు. నిత్యం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు భూ కబ్జాలు చేస్తున్నారని ఆరోపిస్తున్న చమర్తి, వాటిని రుజువు చేయాలని సవాల్ విసిరారు. అధికార అండతో నియోజకవర్గంలో పేట్రేగిపోతున్న టీడీపీ శ్రేణుల ఆగడాలను కూడా విచారణ చేయించి చట్టపరమైన చర్యలు తీసుకునే దమ్ముందా అనేది ఆయనే చెప్పాలన్నారు. ఈ సందర్భంగా చమర్తి పార్టీ విధేయతను వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రశ్నించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ అయిన చమర్తికి నియోజకవర్గాని నిధులు తీసుకొచ్చి అభివృద్ధి పనులు చేయించాలని సూచించారు. గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సుగవాసికి వెన్నుపోటు పొడిచిన వ్యక్తికే టీడీపీ అధిష్టానం ఇన్‌చార్జ్ పదవి ఇవ్వడంపై మీ పార్టీ శ్రేణులే అసహనం వ్యక్తం చేస్తుండటం వాస్తవం కాదా అనేది సమాధానమివ్వాలన్నారు. వ్యక్తిగతంగా నీకు రాయచోటి, రాజంపేట ప్రాంతాలలో ఉన్న విద్యాసంస్థలలో ఉన్న లొసుగులతో పాటు నీ చరిత్రను ప్రజలకి తెలియజేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. రాజంపేట అభివృద్ధికి గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది కాలంలో నియోజకవర్గానికి ఏం చేశారో ప్రజలకు తెలియజేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులపై ఇప్పటికైనా అసత్య ఆరోపణలు ఆపి అభివృద్ధి సహకరించాలంటూ సూచించారు. సమావేశంలో ఆయనతో పాటు డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి పెంచలయ్య, జీవీ సుబ్బరాజు, గంగా కల్యాణ్‌కుమార్‌రెడ్డి, సోంబెత్తిన శ్రీనివాసులు ఉన్నారు.

నమ్ముకున్నవారి కోసం ఎంత దూరమైనా వెళ్లే వ్యక్తి రాజారెడ్డి



వైఎస్ రాజారెడ్డి చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే, నాయకులు

రైల్వేకోడూరు అర్బన్ : నమ్ముకున్న ప్రజల కోసం ఎంత దూరమన్నా వెళ్లే వ్యక్తి వైఎస్ రాజారెడ్డి అని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు శుక్రవారం పేర్కొన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో వైఎస్ రాజారెడ్డి 27 వర్థంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కొరముట్ల మాట్లాడుతూ రాజారెడ్డికి పులివెందుల పుట్టినిల్లు అయితే కోడూరు మెట్టినిల్లని చెప్పారు. ఆయన ఇక్కడే ఎక్కువకాలం గడిపారని తెలిపారు. ఆయన లాగానే వైఎస్ కుటుంబం కోడూరుపై ప్రేమ చూపిస్తున్నారని ఇక్కడి ప్రజలకు వైఎస్సార్ అంటే ఎంతో అభిమాని తెలియజేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, అన్వర్‌బాషా, సీహెచ్ రమేష్, మండల నాగేంద్ర, బండారు మల్లి, ముజీబ్, శంకరయ్య, శివయ్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న ప్రాంతీయ మేనేజర్ సుశాంత్

చిట్వేలి : ఏపీ గ్రామీణ బ్యాంక్ ప్రాంతీయ మేనేజర్ సుశాంత్ కుమార్ స్వారో శుక్రవారం మంగల కేంద్రంలోని ఆ బ్యాంకు శాఖను సందర్శించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఖాతాదారుల సమావేశంలో వారు మాట్లాడుతూ తమ బ్యాంక్ ఒక ఏడాది డిపాజిట్‌పై 7.60శాతం వడ్డీరేటును అందిస్తుందన్నారు. ఇప్పటికే తమ బ్యాంకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రాంతీయ గ్రామీణ బ్యాంకును విలీనమైనట్లు పేర్కొన్నారు. పంట రుణాల కింద గరిష్టంగా రూ. 3 లక్షల వరకు రుణం అందిస్తున్నామన్నారు. ఖాతాదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పొందలూరు, చిట్వేలి శాఖల మేనేజర్లు అశోక్ కుమార్, శ్రీనివాసులు, ఖాతాదారులు, సిబ్బంది పాల్గొన్నారు.

మామపై అల్లుడు దాడి



దాడిలో గాయపడ్డ ప్రభాకర్ రెడ్డి

పుల్లంపేట : పుల్లంపేటకు చెందిన ప్రభాకర్ రెడ్డి తన కుమార్తెను పుల్లంపేటలోని ప్రసాద్ రెడ్డికి ఇచ్చి వివాహం చేశాడు. కొద్దిరోజుల్లోనే కూతురు, అల్లుడి మధ్య సమస్యలు తలెత్తడంతో అల్లుడు వద్దకు వెళ్లి సర్దుకోమని అడుగగా అల్లుడు మామపై దాడి చేసినట్లు మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌లో బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్ఐ శివప్రసాద్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రక్షణగోడ కోసం నిరసన



దీక్ష చేస్తున్న సయ్యద్

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు పట్టణంలోని నరసారాంపేట, శాంతినగర్ మధ్యలో గుంజన ఏరుకు రక్షణ గోడ నిర్మించాలంటూ జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి సయ్యద్ అహ్మద్ శుక్రవారం వినూత్న నిరసన చేపట్టారు. గుంజనేరులోనే వారు నిరాహార దీక్ష చేపట్టారు. కూటమి ప్రభుత్వం వెనువెంటనే ప్రొటెక్షన్ వాల్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ ఇన్‌చార్జ్ గోశాల దేవి, శాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వివాహం జరిపించిన ఆకేపాటి



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట రూరల్ : వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, అమరజ్యోతి దంపతులు వధూవరులకు ఉచితంగా వివాహం జరిపించి ఆశీర్వదించారు. మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్‌లోని దేవాలయముల సముదాయంలో శుక్రవారం రాజంపేట మండలంలోని పులపుత్తూరు దళితవాడకు కుంభగిరి నరసింహులు కుమారుడు మణికంఠ, ఓబులవారిపల్లి మండలం గాదెల గ్రామానికి చెందిన సూరేపల్లి భాస్కర్ కుమార్తె వెంకటేశ్వరికి దగ్గరుండి ఆయన వివాహం జరిపించారు. ముందుగా నూతన వధూవరులకు చీరె, సారె, తాళిబొట్టు అందజేశారు. అనంతరం బంధువులకు ఆయనే స్వయంగా ఆహారం వడ్డించారు. అదే విధంగా మండల పరిధిలోని బాలరాజుపల్లి గ్రామ వలంటీర్ నాగలక్ష్మి వివాహ వేడుకలలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆకేపాటి వధూవరులను ఆశీర్వదించారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై మొగ్గు చూపండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సుండుపల్లె : మండల పరిధిలోని మడితాడు యూనిట్‌లోని మడితాడు వీఓ–1 వద్ద కేపీపీ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా పీఎండీఎస్, నవధాన్యాలు, విత్తన గుళికలు తయారు విధానం గురించి వీహెచ్ఏ రామకృష్ణ అవగాహనా సదస్సును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రకృతి వ్యవసాయం వైపు మొగ్గుచూపాలన్నారు. ప్రస్తుతం వ్యవసాయం అధిక ఖర్చుతో కూడుకున్నదని, అందువల్ల ప్రతి రైతు తక్కువ ఖర్చుతో పీఎండీఎస్ విధానంలో నవధాన్యాలు వేసుకొని కాషాయాలు, ద్రావణాలు వాడి వ్యవసాయం చేయాలని తద్వారా మన ఆరోగ్యం కాపాడుకోవచ్చని వివరించారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో పీఎండీఎస్ విధానాన్ని అవలంభించి గత రెండు సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎగువ నాయునివారిపల్లెకు చెందిన కొండయ్యనాయుడు, రాయవరం జంగంపల్లికు చెందిన రైతు వీరభద్రయ్యను శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఏలు నవీన్, కోటేశ్వరరావు, యూనిట్ ఇంచార్జి ఎస్.వెంకటయ్య, ఐసీఆర్‌పీలు శివరాంప్రసాద్, వీరనాగయ్య, రామచంద్ర, నాగలక్ష్మి, లక్ష్మీదేవి, వీఓఏలు రమణమ్మ, నాగమునెమ్మ, నాగేశ్వరి, ఎస్‌హెచ్‌జీ మహిళలు, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రేషన్ పంపిణీ



డీలర్ల సమావేశంలో మాట్లాడుతున్న అధికారులు

సుండుపల్లె : ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే రేషన్ పంపిణీ చేయాలని తహసీల్దార్ దైవాదీనం తెలిపారు. శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్ డీలర్లతో ఆయన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డోర్ డెలివరీ వాహనాలను రద్దు చేసిన కారణంగా చౌక దుకాణాల డీలర్లు అందరూ రేషన్ ఇచ్చే రోజులలో సమయపాలన పాటిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్క డీలర్ తమ చౌక దుకాణాలలో అవకతవకలకు చోటు ఇవ్వకుండా సక్రమమైన పద్ధతి ద్వారా రేషన్ పంపిణీ చేయాలని ఆయన సూచించారు. చౌకదుకాణాలలో బినామీలు లేకుండా డీలర్లు మాత్రమే పంపిణీ చేయాలని తెలిపారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ సలాం బాషా, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు నాయక్, చౌక దుకాణాల డీలర్లు పాల్గొన్నారు.

సాంకేతిక పరిజ్ఞానంతో అధిక ఆదాయం



మాట్లాడుతున్న సంచాలకులు వెంకటరమణ

రైల్వేకోడూరు అర్బన్ : రైల్వేకోడూరు మండలంలోని అనంతరాజుపేట వైఎస్సార్ ఉద్యాన కళాశాలలో శుక్రవారం రైతులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలపై సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ పరిశోధన స్థాన సంచాలకులు డాక్టర్ వెంకటరమణ హాజరయ్యారు. పలువురు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాంతీయ పరిశోధన, విస్తరణ సలహామండలి సమావేశాలను ప్రాంతాల వారీగా నిర్వహిస్తున్నామన్నారు. రైతుల కోసం చేపట్టాల్సిన పరిశోధన విస్తరణ కార్యక్రమాల భవిష్యత్తు ప్రణాళికను రూపొందిస్తున్నామని, రైతులు క్షేత్రస్థాయిలో ఎదుర్కొంటున్న సమస్యలపై దృష్టిపెట్టామని పేర్కొన్నారు. రైతులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించినప్పుడు పెట్టుబడులు తగ్గి అధిక ఆదాయం వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ సమావేశంలో పలువురు శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చారు.

చర్చలకు పిలవాలి

కడప సెవెన్‌రోడ్స్ : గత 26 రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా తమ న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని కలెక్టరేట్ల కార్యాలయం ముందు సమ్మె చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమస్యను పరిష్కరించాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరనాల శివకుమార్‌లు డిమాండ్ చేశారు. కలెక్టరేట్ ఎదుట కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ల సమ్మెకు డీవైఎఫ్ఐగా సంఘీభావం తెలియజేసింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 26 రోజుల నుంచి సమ్మె చేస్తున్నా రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలవకుండా వారిని కనీసం పట్టించుకోకపోవడం దారుణం అన్నారు. వారి న్యాయమైన కోర్కెలను ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు రెబ్బ నరసింహులు, జిల్లా సహాయ కార్యదర్శి ఎస్కే ఆదిల్ పాల్గొన్నారు.

చలో సంగమేశ్వరం జయప్రదం చేయాలి

కడప రూరల్ : రాయలసీమ విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 31వ తేదిన నిర్వహిస్తున్న చలో సంగమేశ్వరం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాష్ట్ర కార్యదర్శి మల్లేల జగదీష్ అన్నారు. శుక్రవారం స్థానికంగా కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిద్ధేశ్వరం అలుగు నిర్మాణంపై ఈనెల 31న సంగమేశ్వరం దగ్గర భారీ బహిరంగసభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరారు.

సైనిక్ స్కూల్ ఫలితాల్లో మురళీ స్కూల్ విద్యార్థుల సత్తా



గగన్ తేజ్ రాయల్



లిఖిత్ దేవాన్ష్ రెడ్డి



చర్విత రెడ్డి



తేజ్ నందన్



నితిన్ నాయక్



గౌతమి



వెంకట ప్రమోద్



జోషిత

రాయచోటి టౌన్ : దేశస్థాయిలో నిర్వహించే సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష ఫలితాలలో రాయచోటి మురళీ స్కూల్ విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచారని పాఠశాల కరస్పాండెంట్ సరితా దేవి తెలిపారు. గురువారం ఆల్ ఇండియా సైనిక్ స్కూల్ పరీక్ష ఫలితాలు వెలువడ్డాయన్నారు. ఈ ఫలితాలలో గగన్ రాయల్ 294/300 మార్కులు సాధించి ఆల్ ఇండియా 20వ ర్యాంక్, రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. అలాగే లిఖిత్ దేవాన్ష్ రెడ్డి 285, చర్విత రెడ్డి 277, తేజనందన్ 277, నితిన్ నాయక్ 273, గౌతమి 272, వెంకటప్రమోద్ 271, జోషిత 270లతో పాటు 250 మార్కులు పైబడి సాధించిన విద్యార్థులు 25 మంది ఉన్నారని చెప్పారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే ఎలాంటి పోటీ పరీక్షలు అయినా తమ విద్యాసంస్థల నుంచి విద్యార్థులు విశేష ప్రతిభ కనబరిచి ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని పేర్కొన్నారు. ఈసందర్భంగా కరస్పాండెంటెంట్‌తో పాటు ఇతర సిబ్బంది విద్యార్థులను అభినందించారు.